

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.4°/20.8°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పలుచోట్ల వేకువజామున చలి వాతావరణం నెలకొంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

ప్రజలను వంచనజేసి

- తాడిపత్రి మున్సిపాలిటీ సమస్యలు పట్టని చైర్మన్
- 6 నెలలుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా అడ్డంకులు
- 'బస్సు యాత్ర' పేరుతో గాలి తిరుగుళ్లు
- ప్రజల చెవిలో పూలు పెట్టే యత్నాలు



తాడిపత్రి, రూరల్: మున్సిపల్ ఎన్నికల్లో గెలవడానికి జేసీ ప్రభాకర్ రెడ్డి నవరసాలు పండించారు. అవకాశం ఇస్తే అలా చేస్తా, ఇలా చేస్తా అంటూ అరచేతిలో వైకుంఠం చూపారు. బొటాబొటి ఆధిక్యతతో ఎలాగోలా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను మాత్రం గాలికొదిలేశారు. ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతూ ఉంటే, ఎక్కడ అధికార పార్టీకి పేరు వస్తుందనే అక్కసుతో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై చర్చించడానికి, పరిష్కార మార్గం చూపడానికి వేదికైన కౌన్సిల్ సమావేశాన్ని కూడా 6 నెలలుగా నిర్వహించకుండా అడ్డు పడుతున్నారు. కమిషనర్ సహకరించడం లేదంటూ ప్రజల చెవిలో పూలు పెట్టే యత్నం చేస్తున్నారు. ప్రజా సమస్యలు గాలి కొదిలేసి.. తాను మాత్రం గాలి తిరుగుళ్లు తిరుగుతున్నారు. ఒక్క మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి చేతకాని ఆయన.. నియోజకవర్గాన్ని ఉద్ధరిస్తానంటూ కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ మాటున పల్లెల్లో కక్షలు రాజేస్తున్నారు.

రచ్చ చేయడమే పని..

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు సైతం జేసీ ప్రభాకర్ రెడ్డి అడ్డు తగులుతున్నారు. 'నేను చేయను.. మీరు చేయొద్దు..' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. గతంలో మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగిన సమయంలో పట్టణంలో పేరుకుపోయిన చెత్తను ఎమ్మెల్యే తన సొంత నిధులతో తొలగించే ప్రయత్నం చేస్తే అడ్డుకుని నానా యాగీ చేశారు. వేసవిలో పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బోర్ల మరమ్మతులు చేయిస్తుంటే టీడీపీ శ్రేణులతో కలిసి అడ్డుకుని రచ్చ చేశారు. నాలుగున్నరేళ్లుగా ఎమ్మెల్యే ఏ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా అడ్డు తగలడమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వం అభివృద్ధి చేయడం లేదంటూ మళ్లీ తనే ఎల్లో మీడియాతో కలిసి దుష్ప్రచారం చేస్తున్నారు.

ఆది నుంచి అంతే..

చైర్మన్‌గా ఎన్నికైనప్పటి నుంచి జేసీ ప్రభాకర్ రెడ్డి వివాదాలకు కేరాఫ్‌గా నిలిచారు. గత టీడీపీ హయాంలో చేసిన అరాచకాన్ని కొనసాగించారు. మున్సిపాలిటీ ప్రతిష్టను బజారు కీడ్చారు. కొన్నాళ్ల పాటు చైర్మన్ చాంబర్ కోసం కౌన్సిలర్లతో కలిసి నానా రభస చేశారు. తనకు కేటాయించిన చాంబర్ కాదని కమిషనర్ కార్యాలయాన్ని కేటాయించాలని పట్టుబట్టారు. కొన్ని రోజుల పాటు కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు చాంబర్ కేటాయించే విషయంపైనా రచ్చ చేశారు. తన మాట వినడం లేదంటూ గతంలో ఉద్యోగులపై రెచ్చిపోయారు. దీంతో కొందరు ఉద్యోగులు దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడానికి ప్రయత్నించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ అయ్యాక ఏ కమిషనర్ కూడా ఎక్కువ రోజులు పనిచేయలేదు. అసలు మున్సిపాలిటీ అభివృద్ధినే ఆయన ఎన్నడూ పట్టించుకోలేదు. కౌన్సిల్ మీట్ జరుగుతున్న సమయంలో తాను చాంబర్‌లోనే ఉన్నా, వైస్ చైర్మన్లతో సమావేశాలను జరిపించారంటేనే ఆయనకు ప్రజలపై ఏ మాత్రం గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రజలను జేసీ సోదరులు పిచ్చోళ్లనుకుంటున్నారు



"మున్సిపాలిటీ చైర్మన్ పదవికి జేసీ ప్రభాకర్‌రెడ్డి అనర్హుడు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదు. అలాంటి వ్యక్తి బస్సు యాత్రల పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తుండడం హాస్యాస్పదం. నమ్మి ఓట్లేసిని ప్రజలను జేసీ సోదరులు పిచ్చివారు అనుకుంటున్నారు. ఇలాంటి వారికి జనమే గుణపాఠం చెప్పాలి.

– పెద్దారెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

బీటెక్ ఫలితాల విడుదల



జేఎన్‌టీయూ (ఏ) పరీక్షల భవనం

అనంతపురం: బీటెక్ నాలుగో సంవత్సర పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఒకటో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, ఆర్–15, ఆర్–19 సప్లిమెంటరీ ఫలితాలు, నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్ (ఆర్–15 లాస్ట్‌ఛాన్స్) సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు జేఎన్‌టీయూ (ఏ) డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి. చంద్ర మోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్ చూడాలని కోరారు.

భార్య ఎడబాటు తట్టుకోలేక భర్త ఆత్మహత్య

రాప్తాడు రూరల్: భార్య ఎడబాటును తట్టుకోలేక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌కు చెందిన నరసింహులు (40)కు 12 ఏళ్ల క్రితం ఉరవకొండకు చెందిన మహిళతో వివాహమైంది. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. చేనేత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో కొంత కాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు చెలరేగి తరచూ గొడవ పడేవారు. చివరకు భార్య సర్దుకుపోలేక ఆర్నెల్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అంతటితో ఆగకుండా తనకు విడాకులు కావాలంటూ దరఖాస్తు చేయడంతో నరసింహులకు నోటీసులు జారీ అయ్యాయి. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు లోనైన నరసింహులు.. రోజు క్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఇంట్లో బెడ్రూమ్‌లోకి వెళ్లి పడుకున్నాడు. తల్లిదండ్రులు మరో బెడ్రూమ్‌లో పడుకున్నారు. ఉదయం 6.30 గంటలకు లేచి చూడగా కుమారుడి బెడ్రూం తలుపులు తీయలేదు. అనుమానం వచ్చి తలుపులు ఎంత కొట్టినా లాభం లేకపోయింది. చివరికి బయట వైపు వెళ్లి కిటికీలో నుంచి చూడగా కుమారుడు ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యుల రోదనలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని బలవంతంగా తలుపులు తీసి లోపలకు ప్రవేశించారు. ఉరికి వేలాడుతున్న నరసింహులును కిందకు దించి పరిశీలించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో 80 వానరాల మృతి



కోతుల కళేబరాలు

రొద్దం: మండలంలోని చోళేమర్రి సమీపంలో సుమారు 80 వానరాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. గ్రామ సమీపంలోని కాలనీ వద్ద వానర కళేబరాలను గుట్టగా పడేసి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ ప్రాంతం కానందున ఖననం చేసేయాలని వారు సూచించడంతో కాలనీ వాసులు జేసీబీతో గుంత తీయించి కళేబరాలను ఖననం చేశారు. సమీపంలోనే బిహార్, రాజస్థాన్, బెంగళూరు వాసుల వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయి. ఆయా క్షేత్రాల సిబ్బంది పంటలను రక్షించడానికి కోతులపై విష ప్రయోగం చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

1,20,347 మందికి 'వైఎస్సార్ చేయూత'

- రూ.225.651 కోట్ల లబ్ధి

అనంతపురం క్రైం: జిల్లాలో 'వైఎస్సార్ చేయూత' పథకానికి ఈ ఏడాది 1,20,347 మంది అర్హత సాధించినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. వీరికి రూ.225.651 కోట్ల లబ్ధి కలగనుందన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లో 45 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. 'వైఎస్సార్ చేయూత' పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2020 ఆగస్టు 12న ప్రారంభించారన్నారు. ఏటా రూ.18,750 చొప్పున ఇప్పటివరకూ మూడు సార్లు ఆర్థిక సాయం అందించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 24 లక్షల మందికి రూ.4,500 కోట్లు, రెండో విడతలో 24.95 లక్షల మందికి రూ.4,679.46 కోట్లు, మూడో విడతలో 26.39 లక్షల మందికి రూ.4,949.44 కోట్లు మొత్తంగా రూ.14,129.11 కోట్లను డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. నాలుగో విడతగా ఈ నెల 7న నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

'పది' ప్రశ్నపత్రాలు వచ్చేశాయ్!

అనంతపురం ఎడ్యుకేషన్: పదోతరగతి ప్రశ్న పత్రాలు జిల్లాకు చేరాయి. సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి జి.రామకృష్ణారెడ్డి, డీఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ప్రశ్నపత్రాలను స్థానిక కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 18 నుంచి 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. 40,063 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 31,330 మంది, ప్రైవేట్ విద్యార్థులు 8,733 మంది ఉన్నారు. 142 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి





మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, హాజరైన అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

- ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు
- కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. కొన్ని కేంద్రాల మార్పుతో పాటు మరికొన్ని కేంద్రాల పేర్లు మార్చినట్లు వెల్లడించారు. కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2,213 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1,450 నుంచి 1,500 మధ్య ఓట్లు ఉన్న కేంద్రంలో సహాయక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 4 సహాయక కేంద్రాలు, తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో 2, అనంతపురం అర్బన్ పరిధిలో 15, రాప్తాడు నియోజకవర్గంలో 2 మొత్తం 23 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. జిల్లాలో 85 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పునకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఒకటి, ఉరవకొండ–17, గుంతకల్లు– 21, తాడిపత్రి– 8, శింగనమల–3, అనతపురం అర్బన్–7, కళ్యాణదుర్గం–3, రాప్తాడు నియోజకవర్గంలో 25 కేంద్రాల పేర్ల మార్పునకు ప్రతిపాదనలు అందాయన్నారు. వీటిని నేడు (మంగళవారం) ఎన్నికల కమిషన్‌కు పంపనున్నట్లు వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా ప్రతి అంశాన్ని సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. పేరు మార్పు, కేంద్రాల మార్పుపై ఓటర్లకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈఆర్‌ఓలు జి.వెంకటేష్, రాణిసుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, కరుణకుమారి, రాంభూపాల్‌రెడ్డి, వి.శ్రీను, వసంతబాబు, పార్టీల ప్రతినిధులు సోమశేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్, ఈశ్వర్ ప్రసాద్, ఎంఎండీ ఇమామ్, మసూద్‌వలి, అంజయ్య, బాలరంగయ్య, ఎన్నికల్ సెల్ సూపరింటెండెంట్ రవి కుమార్, తహసీల్దార్లు శివరామిరెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

100 శాతం ఓటింగ్‌కు కృషి చేయాలి

ఓటు హక్కు వినియోగంపై పౌరులకు విస్తృత అవగాహన కల్పించి 100 శాతం ఓటింగ్ నమోదుకు కృషి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గాల పరిధిలో తక్కువ ఓటింగ్ నమోదైన చోట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలో మహిళా సంఘాల సభ్యులు నిర్వహించే సమావేశాల్లో ఓటుహక్కు ఆవశ్యకత తెలియజేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు సోషల్ మీడియా టీమ్‌లను ఏర్పాటు చేసుకుని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ అకౌంట్లలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల వెనుక పోస్టర్లు అతికించాలన్నారు. బస్టాండు, రైల్వే స్టేషన్లలో ఆడియో విజువల్స్, స్క్రోలింగ్ ఇవ్వాలన్నారు. పురపాలక, నగరపాలక సంస్థల పరిధిలో జన సమూహం ఉండే ప్రదేశాలు, కూడళ్లలో విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆర్‌డీఓలు వెంకటేష్, రాణిసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమన్వయంతో పనిచేద్దామని అంతర్ రాష్ట్ర అధికారులను కలెక్టర్ గౌతమి కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో కలిసి అంతర్‌రాష్ట్ర సరిహద్దు అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాయదుర్గం, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలోని రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, కంబదూరు, బ్రహ్మసముద్రం, తదితర మండలాలు అంతర్‌రాష్ట్ర సరిహద్దులో ఉన్నాయన్నారు. చిత్రదుర్గ, బళ్లారి తదితర జిల్లాల మధ్య అనుసంధానం చాలా ఎక్కువగా ఉందన్నారు. నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఆయుధాలు తదితరాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో అంతర్రాష్ట్ర స్టాటిక్ చెక్ పోస్టులు, డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో అదనపు చెక్‌పోస్టులు, కాంపోజిట్, సర్‌ప్రైజ్ చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారు, రౌడీ షీటర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.ఎన్నికలయ్యేంత వరకూ సమన్వయంతో సాగి, అక్రమాలు అరికడదామని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రాణిసుస్మిత, ఈఆర్‌ఓ కరుణకుమారి, సెబ్ ఏఎస్పీ జి.రామకృష్ణ, ఏఎస్పీ (అడ్మిన్) విజయభాస్కర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, చిత్రదుర్గ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గడువుకు ముందే అర్జీలు పరిష్కరించాలి

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం
- 'స్పందన'లో 327 వినతులు



అర్జీదారుల సమస్యలు వింటున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీలను గడువు కంటే ముందే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్‌తో పాటు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 327 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. వారు సంతృప్తి చెందేలా సమస్య పరిష్కరించాలన్నారు. గడువు వరకు వేచి ఉండకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్క అర్జీ కూడా రీ–ఓపెన్ కాకూడదన్నారు. అర్జీల పరిష్కారంపై రోజూ సిబ్బందితో సమీక్షించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వినతుల్లో కొన్ని..

- ఇంటి స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జయరామ్, మహిళ అధ్యక్షురాలు జయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిలేటి, సంజమ్మ, హుసేన్‌బీలు విన్నవించారు. టీవీ టవర్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో తాము గుడిసెలు వేసుకుంటే అధికారులు తొలగించారన్నారు. అదే స్థలంలో వేరొకరు గుడిసెలు వేసి 15 రోజులవుతున్నా అటువైపు చూడలేదన్నారు. తమ దీనావస్థను గుర్తించి ఇంటి స్థలం మంజూరు చేయాలన్నారు.
- కుమారులు తన బాగోగులు చూడడం లేదని గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన జెన్నె చిన్నసబ్బన్న ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబరు 161–1, 2లో ఉన్న తన 6 ఎకరాలను కుమారులు జెన్నె ఆంజనేయులు, జెన్నె వెంకటేశ్వర్లు పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించానన్నారు. అయినా, వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. కుమారుల పేర్లను ఆన్‌లైన్‌లో తొలగించి, తన పేరు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు.

క్వారీతో అవస్థలు పడుతున్నాం



విడపనకల్లు పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌ఐకు వినతి పత్రం అందజేస్తున్న కడదరబెంచి గ్రామస్తులు

- వెంటనే మూసేయించండి
- పోలీసు స్టేషన్ ఎదుట కడదరబెంచి గ్రామస్తుల ఆందోళన

విడపనకల్లు: ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంకర క్వారీతో అవస్థలు పడుతున్నామని, దాన్ని వెంటనే మూసేయించాలని విడపనకల్లు మండలంలోని కడదరబెంచి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు విడపనకల్లు పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కంకర క్వారీ కారణంగా గ్రామంలో కాలుష్యం ఎక్కువైందన్నారు. శక్తివంతమైన డైనమైట్లు పెట్టి పేలుస్తుండడంతో పెద్ద పెద్ద శబ్దాలకు ఇళ్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. వ్యవసాయ బోర్లు దెబ్బతిని, పంట పొలాలు పాడైపోతున్నాయని వాపోయారు. తినే ఆహారంపైనా దుమ్ము ధూళి చేరుతోందన్నారు. ఆహారం, నీరు కూడా కలుషితమై అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. కొండలను పగులగొట్టి, అక్రమంగా కంకర అమ్ముకుంటూ భారీగా సంపాదిస్తున్నారన్నారు. క్వారీ నుంచి రాకపోకలు సాగించే వాహనాల కారణంగా రోడ్లు కూడా దెబ్బతింటున్నాయన్నారు. అనేక సార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్గించే విధంగా క్వారీకి ఎలా అనుమతులు ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని అనేక సార్లు రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా క్వారీ మూసేయించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్‌ఐ ఖాజా హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు.

టీడీపీలో చల్లారని చిచ్చు

- తమ నేతకు టికెట్ నిరాకరణపై జీర్ణించుకోలేని అనుచరులు
- 'దుర్గం'లో అమిలినేని ఫ్లెక్సీలు చించివేసిన ఉమా వర్గం
- చంద్రబాబు నచ్చజెప్పినా 'శింగనమల' టీడీపీలో ఫలితం శూన్యం



ముద్దినాయనపల్లిలో గొడవ పడుతున్న అమిలినేని, ఉమా వర్గీయులు



బండారు శ్రావణికి వ్యతిరేకంగా యల్లనూరులో ఆదివారం సమావేశమైన టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం: అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ అధినేత చంద్రబాబు రాజేసిన చిచ్చు చల్లారడం లేదు. తమ నేతకు టికెట్ నిరాకరణపై తమ్ముళ్లు అలక వీడడం లేదు. కళ్యాణదుర్గం టికెట్‌ను సీనియర్లను కాదని డబ్బున్న కాంట్రాక్టర్‌కు కట్టబెట్టడాన్ని వ్యతిరేక వర్గాలు సహించలేకపోతున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. వివరాలు.. తనను కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో అమిలినేని సురేంద్రబాబు ప్రచారానికి తెరలేపారు. కొన్ని రోజులుగా గ్రామాల్లో తన ఫ్లెక్సీలు కట్టించే కార్యక్రమం చేపడుతున్నారు. ఈ క్రమంలోనే సోమవారం కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లిలో అమిలినేని వర్గీయులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో చిర్రెత్తిన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడు వర్గీయులు ఫ్లెక్సీలను చించివేశారు. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అమిలినేని డబ్బు ఆశ చూపి చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంపై కనీస అవగాహన లేని వ్యక్తికి టికెట్ కేటాయిస్తే ఎలా పనిచేయాలంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో రోడ్డుపైనే ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. అనంతరం ఒకరిపై ఒకరు కళ్యాణదుర్గం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

చంద్రబాబు ఆదేశాలు బేఖాతరు

యల్లనూరు: శింగనమల టీడీపీలోనూ మంట చల్లారడం లేదు. పార్టీ అభ్యర్థిగా బండారు శ్రావణిని ఎంపిక చేయడంపై గుర్రుగా ఉన్న ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఎంఎస్ రాజుకు చంద్రబాబు నచ్చజెప్పినా వారు అలక వీడలేదు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం (ఆదివారం) యల్లనూరు మండల కేంద్రంలో వారి వర్గీయులు శ్రావణికి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. ఆమెకు మద్దతు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. ఇక.. ఇటీవల చాలా చోట్ల తమ్ముళ్లు రహస్యంగా సమావేశమవుతున్నారు. ఇన్నాళ్లూ ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేశామని,ఉన్నట్లుండి చంద్రబాబు వేరొకరు అంటే ఎలా? అంటూ తమలో తామే చర్చించుకుంటున్నారు. చాలా మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

ప్రాణాలు బలిగొన్న అతి వేగం


విష్ణు (ఫైల్)

బుక్కరాయసముద్రం: అతి వేగం ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురానికి చెందిన సూర్యనారాయణ కుమారుడు విష్ణు (24) వ్యక్తిగత పనిపై ఆదివారం నార్పలకు వెళ్లాడు. పని ముగించుకుని రాత్రికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. బీకేఎస్ మండలం వెంకటాపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే వాహన వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం ఉదయం విష్ణు మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుందుర్పి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన ఈడిగ ఈశ్వరయ్య (53) సోమవారం ఉదయం కర్ణాటకలోని వైఎన్హెచ్ కోటలో మద్యం టెట్రా ప్యాకెట్లు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. కుందుర్పి మండలం తూముకుంట దాటిన తర్వాత ఎనుములదొడ్డి మార్గంలో నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న గోతిలోకి దూసుకెళ్లాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో ఈశ్వరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ పీఎంకేవీవై విభాగంలో మహిళలకు 'డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్' కోర్సుపై ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ సి.రామమూర్తి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 6వ తేదీ నుంచి పేర్లను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆన్లైన్లో పేర్ల నమోదుకు ఫొటో, ఆధార్, విద్యార్హతలు, మెయిల్ ఐడీ, ఆధార్ అనుసంధాన మొబైల్ నంబరును జత చేయాల్సి ఉంటుంది. ఈ నెల 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్లు అందజేస్తారు. పూర్తి వివరాలకు బాలుర ఐటీఐ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ప్రవాహంలా పాలవెల్లువ



- ఐదు మండలాలు, 100 గ్రామాల నుంచి పాలసేకరణ
- ప్రారంభమైన వారం రోజులకే 10 వేల లీటర్ల సేకరణ
- తొమ్మిది పాల రూట్లు, రెండు చోట్ల బీఎంసీల ఏర్పాటు

అనంతపురం అగ్రికల్చర్: జగనన్న పాలవెల్లువకు 'అనంత' పాడి రైతులు, మహిళలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రారంభించిన వారం రోజులకే సేకరణ కేంద్రాలకు పాలు ప్రవాహమై రాసాగాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో 15 రోజుల్లో 16 వేల లీటర్ల రోజువారీ సేకరణ లక్ష్యాన్ని చేరుకుంటామని పశుశాఖ, డెయిరీ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వారం లోపే 10 వేల లీటర్లు:

సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి మాటలను విశ్వసించిన జిల్లా పాడి రైతులు 'అమూల్' సహకారంతో మొదలుపెట్టిన జగనన్న పాలవెల్లువ కార్యక్రమానికి విశేషంగా స్పందిస్తున్నట్లు స్పష్టమవుతోంది. జిల్లాలో తొలివిడతగా గత నెల 27న జగనన్న పాలవెల్లువ పథకం ప్రారంభించారు. అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లోని 54 ఆర్బీకేల పరిధిలో 100 గ్రామాల నుంచి ప్రస్తుతం పాల సేకరణ మొదలు పెట్టారు. తొలిరోజు 3,200 లీటర్ల సేకరణతో శుభారంభం చేసిన ఈ పథకం వారం తిరగక మునుపే 10 వేల లీటర్ల రోజువారీ సేకరణ లక్ష్యాన్ని అధిగమించింది.

ప్రైవేట్ డెయిరీల కంటే రూ.10 అదనం

పశుశాఖ, డీఆర్డీఏ, సహకారశాఖ, డెయిరీ అధికారులు సంయుక్తంగా సర్వేలు నిర్వహించి ఎంపిక చేసిన గ్రామాల్లో మహిళల సొసైటీలు ఏర్పాటు చేసి పాల సేకరణకు అవసరమైన అనలైజర్,అధునాతన బిల్లింగ్ మిషన్, ఇతరత్రా సామగ్రి అందజేశారు. తొమ్మిది ప్రాంతాలను పాల రూట్లుగా విభజించి అక్కడి నుంచి సేకరించిన పాలను... కొర్రపాడు, రాచానపల్లిలో ఏర్పాటు చేసిన బల్క్ మిల్క్ కూలింగ్ (బీఎంసీ) సెంటర్లకు తరలిస్తున్నారు. పాల నాణ్యతను బట్టి ప్రైవేట్ డెయిరీల కన్నా లీటర్పై అదనంగా రూ.5 నుంచి రూ.10, ఇంకా అంతకన్నా ఎక్కువగానే చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పాలు పోసిన పాడి రైతులు, మహిళా రైతులకు పది రోజులకోసారి అంటే నెలకు మూడు సార్లు చెల్లింపులు ఉంటాయన్నారు.

16 వేల లీటర్ల సేకరణ లక్ష్యం

జగనన్న పాలవెల్లువ ద్వారా జిల్లాలో రోజువారీ 16 వేల లీటర్ల పాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామాల్లో మహిళా పాడిరైతుల నుంచి మంచి స్పందన లభిస్తుండటంతో ఈ లక్ష్యాన్ని మరో 15 రోజుల్లోనే అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 900 మంది వరకూ లబ్ధిదారులు పాలు పోస్తున్నట్లు వివరించారు. సోమవారం 100 గ్రామాల నుంచి ఉదయం 5,500 లీటర్లు, సాయంత్రం 4,500 లీటర్ల చొప్పున తొలిసారిగా 10 వేల లీటర్ల మార్క్ను చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఇంటింటా సోలార్ వెలుగులు

- సర్కారు సరికొత్త పథకం
- ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్
- ఆసక్తి ఉన్న ఇంటి యజమానుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



అనంతపురం సిటీ: సౌరశక్తితో ఇంటింటా వెలుగులు నిండనున్నాయి. ఉచిత విద్యుత్తో ప్రతి ఇల్లూ దేదీప్యమానంగా కాంతులీననుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి ఇంటికీ సోలార్ ప్లేట్లను సరఫరా చేయడం ద్వారా 300 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ పొందే అవకాశం కల్పించనుంది. కేంద్ర ప్రభుత్వ ఈ పథకంపై తపాలా శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ శాఖ పీఆర్ఓ ప్రమోద్కుమార్రెడ్డి తెలిపారు.

ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు

సౌరశక్తిని ఉపయోగించి విద్యుత్ బిల్లులు ఆదా చేయాలనుకునే వారు కేంద్ర ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. తమకు దగ్గరలోని పోస్టాఫీసులకు వెళ్లి పోస్ట్మాస్టర్ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. 1 కేడబ్ల్యూ పైకప్పునకు సాధారణంగా 8–10 చ.మీ. నీడలేని ప్రాంతం అవసరం. వినియోగదారుడు సెల్ఫోన్ కచ్చితంగా కలిగి ఉండాలి. ఇంటికి ఆర్సీసీ స్లాబ్ ఉండాలి. తగినంత లోడ్ బేరింగ్ సామర్థ్యం ఉన్న ఏ రకమైన పైకప్పుపై సౌర పీవీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు '1 కేడబ్ల్యూ' సౌర విద్యుత్ కేంద్రం ఒక రోజులో 4–4.5 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. పైకప్పుపై అమర్చిన సోలార్ ప్యానల్ ప్రామాణిక జీవితకాలం 25 ఏళ్ల పాటు ఉంటుంది. సౌర విద్యుత్ ప్యానల్ కొనుగోలు విషయంలో డిస్కం నిర్ణయించిన ధరల ప్రకారం ముందుగానే వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది.

సౌరశక్తిపై సబ్సిడీ ఇలా...

యూనిట్లు	సామర్థ్యం	అంచనా మొత్తం	సబ్సిడీ
0 - 150	1 - 2 కేడబ్ల్యూ	రూ.55 వేలు నుంచి రూ.65 వేలు	రూ.30 వేల నుంచి రూ.60 వేలు
150 - 300	2 - 3 కేడబ్ల్యూ	రూ.లక్ష నుంచి రూ.1.15 లక్షలు	రూ.60 వేల నుంచి రూ.78 వేలు
300 ఆపైన		రూ.1.40 లక్షల నుంచి రూ.4.60 లక్షలు	రూ.78 వేలు

అట్టహాసంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, యాగశాలలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

- ధ్వజారోహణతో ప్రారంభమైన బుగ్గరామలింగేశ్వర స్వామి ఉత్సవాలు
- సకల దేవతలను ఆహ్వానిస్తూ హోమం

తాడిపత్రి అర్బన్: స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణతో మంత్ర పూరిత ధ్వజపటం ఎగురవేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. పుణ్యాహవాచనం, శివ సంకల్పం, చండీశ్వర పూజ. రుత్విగ్వరణం, అఖండస్థాపన, వాస్తుపూజ, వాస్తుహోమం, పంచావరణార్చన, వండపారాధన, కలశస్థాపన తదితర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖరశర్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలి : ఎస్పీ


పిటీషనర్లతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: స్పందన కార్యక్రమంలో అందజేసిన వినతులకు నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపి పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలని సిబ్బందిని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 138 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా పోలీసు స్పందన విభాగం 9392926803కు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


టెట్రా ప్యాకెట్లు చూపుతున్న సెబ్ పోలీసులు

కంబదూరు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని కంబదూరు సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ఒంటారెడ్డిపల్లి, కురాకులపల్లి గ్రామాలకు చెందిన ప్రభాకర్, గంగాధర్, వరలక్ష్మి సోమవారం ఉదయం మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని సెబ్ సీఐ టక్కీబాషా, ఎస్ఐ వెంకటరత్నం తెలిపారు. వీరి నుంచి 99 టెట్రా ప్యాకెట్లు, 24 రాయల్ ఛాలెంజ్ బీర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే రూ.2.11 లక్షల విలువైన మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు.

789 మంది విద్యార్థుల గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 789 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 23,679 మందికి గాను 22,997 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,440 మందికి గాను 2,323 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ రెండు కేంద్రాలు, డీఈసీ సభ్యులు రెండు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 8 కేంద్రాలను తనిఖీ చేశాయి. రెండు కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ను ఏర్పాటు చేశారు.


గంజాయి విక్రేత అరెస్టు

గుత్తి: స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని పత్తికొండ రోడ్డు బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తూ గుత్తి మండలం టి. కొత్తపల్లికి చెందిన బొంబాయి నరేష్ పోలీసులకు పట్టుబడ్డాడు. సోమవారం ఇన్చార్జ్ సీఐ రాజశేఖర్రెడ్డి, ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నరేష్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో ఆరా తీశారు. 1,145 గ్రాముల గంజాయి బయటపడడంతో స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

శిల్పకళల కాణాచి 'లేపాక్షి'

- అరుదైన చారిత్రక సంపదకు నిలయం
- ఈ నెల 7 నుంచి బ్రహ్మోత్సవాలు
- దేశవిదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఆలయంలోని వింతలు


ప్రసిద్ధిగాంచిన నంది విగ్రహం


ఏడుశిరస్సుల నాగేంద్రుని విగ్రహం

లేపాక్షి: అరుదైన శిల్పకళలకు కాణాచి... అరుదైన చారిత్రక అద్భుతం... వెయ్యి నోళ్ల పొగడ తరము కాని శిల్పసౌందర్యం... ప్రపంచానికే ఆదర్శమైన ప్రకృతి సంపదగా నిలిచిన లేపాక్షి... మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకూ పురాతన దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

15వ శతాబ్దం నాటి అరుదైన ఆలయం

దక్షిణ భారత సువర్ణ యుగంగా భావించే విజయనగర రాజుల కాలంలో నిర్మించిన సుందర దేవాలయాలలో లేపాక్షి ఆలయం ఒకటి. లేపాక్షి ఓ కుగ్రామమే అయినా ఇక్కడున్న ప్రాచీన దేవాలయం వల్ల నేడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. విజయనగర రాజు శ్రీకృష్ణ దేవరాయల పరిపాలనా కాలంలో పెనుకొండ ప్రాంతానికి సామంత రాజుగా ఉన్న విరూపన్న, వీరన్న అనే సోదరులు తమ కులదైవం వీరభద్రుని పేర 15వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. ఎంతో నైపుణ్యమున్న శిల్పులు చెక్కిన శిల్పాల్లో జీవం ఉట్టిపడుతుండడం ఇక్కడి ప్రత్యేకత

ఆలయంలో అబ్బురపరిచే అంశాలెన్నో

- లేపాక్షి ఆలయంలోని ఎన్నో వింతలు దేశవిదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.
- మొత్తం 70 స్తంభాలతో నిర్మించిన ఈ ఆలయంలో ఒక్క స్తంభం మాత్రం గాలిలో వేలాడుతున్నట్టుగా ఉంటుంది. ఈ స్తంభం కింది భాగం నుంచి ఓ వస్త్రాన్ని ఒకవైపు నుంచి మరోవైపునకు లాగేవచ్చు. ఏ కారణంచేతనైనా మంటపం కూలిపోయే పరిస్థితి వస్తే ఈ వేలాడే స్తంభం కిందకు ఆనుకుని ఏ ఒక్క స్తంభం పడిపోకుండా అన్ని స్తంభాలను కట్టడి చేస్తుందని చరిత్రకారులు చెబుతున్నారు.
- ఆలయ మొదటి ప్రాంగణాన్ని అందమైన చతురస్రాకారపు మంటపంగా నిర్మించారు. ప్రకృతి మలచిన నీటికొలను గర్భాలయానికి పడమటి దిశలో ఉంది. రెండవ ప్రాంగణపు వెలుపలి గోడపై అసంఖ్యాక శాసనాలు కన్నడ భాషలో చెక్కి ఉన్నాయి. ఈ ప్రాంగణంలోనే అయిదు మీటర్ల ఎత్తున ఉన్న నాగలింగేశ్వర శిల్పం చూపరులను అబ్బురపరుస్తుంది.
- రెండవ మహాద్వారం దాటితే నాట్య మంటపం ఉంటుంది. ఎనిమిది జతల ఉత్తమాశ్వాలు కట్టిన రథంలా దీనిని తీర్చిదిద్దారు. పరమేశ్వరుని నర్తన మందిరంగా దీనిని పిలుస్తుంటారు. ఇక్కడ భిన్న ముఖాల శిల్పాలతో కూడిన 70 స్తంభాలు ఉన్నాయి. ఈ మంటపం పైకప్పులో అమర్చిన శత పత్ర కమలం ప్రత్యేక ఆకర్షణగా మారింది. నాట్యాచారుడైన భ్రుంగీశ్వరుని పర్యవేక్షణలో రంభ, ఊర్వశిల నాట్యం, తాళాలు చేతపట్టిన దత్తాత్రేయుడు, పరమశివుని తాండవ నృత్యం, నాట్యాన్ని వీక్షిస్తున్న పార్వతి, సేవానిరతులైన చెలికత్తెలు, సూర్యుని నాదస్వరం, తుంబురాన్ని చేతపట్టిన కిన్నెర, నందీశ్వరుడు మృదంగం, విశ్వబ్రహ్మ మద్దెల, వీణా మృదంగధారులైన సరస్వతి, బ్రహ్మదేవుడి ఆసక్తికరమైన శిల్పాలు, యాచకుడిగా పరమేశ్వరుని శిల్పం చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. నాట్య మంటపంపై పైకప్పులో అసంఖ్యాక తైలవర్ణ చిత్రాలు ఉన్నాయి. భారత, రామాయణ, శివ పురాణాల్లో ప్రముఖ ఘట్టాల్ని కథా రూపంగా ఇక్కడ చిత్రీకరించారు.
- నలభై ఒక్క స్తంభాలతో అలరారే పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మంటపం గర్భగుడికి పడమర ఉంది. ఆంజనేయ మంటపం ఎదురుగా ఉన్న బండపై సదా నీరు ప్రవహించే పాదముద్ర ఉంది. మండు వేసవిలోనూ పాదముద్రలో నీరు ప్రవహిస్తూ ఉండడం ఇక్కడి విశేషం.
- లేపాక్షిలో మహానంది నిర్మాణ ఇతిహాసం చాలా ఆసక్తికరంగా ఉంది. ఒకప్పుడు కూలి విషయంగా తలెత్తిన వివాదం కారణంగా శిల్పులందరూ మూకుమ్మడిగా చెక్కడం ఆపి సమ్మె చేస్తూ కాలాన్ని వృథా చేయడం ఇష్టం లేక ఆలయానికి తూర్పు దిశలో భువి నుంచి మొలకెత్తిన భారీ శిలకు నంది రూపాన్ని ఇచ్చారని చరిత్ర కారులు చెబుతున్నారు. 5 మీటర్ల ఎత్తు, 9.5 మీటర్ల పొడవున్న ఈ మహానంది సౌందర్యం వర్ణనాతీతం.

11వ తేదీ వరకూ శివరాత్రి ఉత్సవాలు

ప్రపంచ పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకూ మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయం ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఏటా మహాశివరాత్రిని పురస్కరించుకుని వీరభద్రస్వామి రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు.

అక్రమాల పల్లెపై చర్యలు తీసుకోండి


జేసీ కేతన్గార్గ్కు ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్

అనంతపురం అర్బన్: కోర్టు కేసులో ఉన్న భూమిని మాజీ మంత్రి పల్లె రఘునాథ్రెడ్డి కొనుగోలు చేయడమే కాక, అందులో ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపట్టారని, అక్రమాలకు తెరదీసిన పల్లెపై చర్యలు తీసుకోవాలంటూ జాయింట్ కలెక్టర్ కేతన్గార్గ్కు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, కె.ఎండీ.జక్రియా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగర శివారులోని ఆలమూరు గ్రామంలో 200 ఎకరాల భూమికి సంబంధించి పార్టిషన్ సూటు (ఓఎస్ నెంబరు 20/2015) వివాదం అనంతపురం ఒకటవ అడిషనల్ జడ్జి కోర్టులో నడుస్తోందన్నారు. ఈ వివాదం ఎటూ తేలకుండానే 2016లో ఆ భూమిని కొనుగోలు చేసి, ఎలాంటి అనుమతుల్లేకుండా కట్టడాలు నిర్మించారన్నారు. ప్రస్తుతం అక్కడ వ్యవసాయ కళాశాలను నిర్వహిస్తున్నారని వివరించారు. అంతే కాక రైతుల కోసం ప్రభుత్వ భూమిలో నిర్మించిన చెక్డ్యామ్ను ఆక్రమించి పూడ్చి వేయిస్తున్నారన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమ కట్టడాలను తొలగించాలని, చెక్డ్యామ్ను పూడ్చివేయించినందుకు పల్లెపై కేసు నమోదు చేయాలని కోరారు.

రేపు 'యూత్ పార్లమెంట్'

అనంతపురం కల్చరల్: ఈ నెల 6న జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ నిర్వహిస్తున్నట్టు నెహ్రూ యువకేంద్రం అధికారి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నెహ్రూయువకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూఏ క్యాంపస్ కళాశాల ఆడిటోరియం వేదికగా జరిగే ఈ కార్యక్రమానికి 15 నుంచి 29 ఏళ్ల వయస్సు కలిగిన యువతీయువకులు అర్హులన్నారు. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్, నారీశక్తి, ప్రధానమంత్రి శక్తి, యువత అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తి వంటి అంశాలపై చర్చించాల్సి ఉంటుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రం, ట్రోఫీ అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 98498 71174లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రాయదుర్గం టౌన్: కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. రాయదుర్గంలోని కుమ్మరవీధిలో నివాసముంటున్న రామకృష్ణ (60) ఆదివారం తెల్లవారుజామున వినాయక సర్కిల్లో రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం మధ్యాహ్నం ఆయన మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాగా, బేల్దారి పనులతో జీవనం సాగించే ఆయనకు భార్య నాయకుల గౌరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు ప్రతి మంగళ, శుక్రవారములలో

SRI VENKATESWARA INSTITUTE OF TECHNOLOGY - ANANTAPUR
(APPROVED BY A.I.C.T.E & AFFILIATED TO JNTUA, ANANTAPURAM)
NH-44, HAMPAPURAM [V], RAPTHADU [M], ANANTAPURAM-515722
Email : hr@svitatp.ac.in Contact: 8331047022, 8885750557
WANTED FACULTY
Applications are invited from eligible candidates for the faculty positions in the following department.

DEPARTMENT	FACULTY POSITIONS
CSE, CSD, CSM, ECE, MECH, EEE, CIVIL, Mathematics, Chemistry, Physics & English	PROFESSOR, ASSOCIATE PROFESSOR, ASSISTANT PROFESSOR

Application should be sent to the above email ID
Qualification & salary as per AICTE norms -Principal

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
FREE TRAINING
■ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే Python, Java, Web Designing, గ్రాఫిక్ డిజైనింగ్ కోర్సుల నందు డిగ్రీ ఆపై అర్హత గలిగి 18-25 సం॥లోపు వారికి ఉచిత శిక్షణ + ఫ్రీ ఫుడ్ వసతి కల్పించబడును. సెల్: 9866828071. [A-784577]

EDUCATION
■ Single Sitting : 10th, Inter, BA, B.Com, B.Sc, BED, BPED, UGDPED, BBA, MBA, DMLT, BMLT, B.Tech, NURSING ITI, Pharmacy, LLB, Phd : 81435 83986 [L-806425]

SERVICES
GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2506]

WANTED
■ WANTED RECEPTIONIST & TELECALLER IN DIGITAL IT, Salary : 7 K - 10 K, Intersted Make Call : 9059692568, 8639389179. [A-784578]
■ Hiring For Operations / Campus Manager Primary & High School Teachers. Walk in Between 10am - 5pm. Contact: 8978066668, Tag Public School Ramnagar, Ananthapur. [HA-2118]

■ ROYALOAK FURNITURE నందు పనిచేయుటకు మేనేజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సేల్స్ & డెలివరీ బాయ్స్ కావలెను. మార్చి 4, 5 తేదీల్లో 11-30 AM కు ఇంటర్వ్యూ జరుగును. # వేణుగోపాల్ నగర్, NTR మార్గ్ రోడ్డు, ATP. [A-784571]
■ SSC/ఇంటర్, ITI, డిప్లొమా (P/F) అయి ఖాళీగా ఉన్న 24 స్త్రీ/పు జాబ్ చేయుటకు కావలెను. జీతం: 14,000+6,000 DA+ఫ్రీరూమ్, సాయినగర్, 1st క్రాస్, అనంతపురం. ఫోన్: 80742 77136. [L-822427]
■ Require ITI Electricians freshers & Exp. for KURNOOL MNC COMPANY, Sal: 12,000/- to 15,000/- Accommodation free. Lava Kumar- 9966210410, 9182063443. [L-822428]
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233868]
■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 79812 69807 [V-797200]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ANDHRA PRADESH SOLAR POWER CORPORATION PVT LTD
(A Joint venture company of Government of A.P and Government of India)
e - Procurement Tender Notice
APSPCL invites tender for "Providing Standard Fire & Special Perils Insurance cover to 9 No. 220/33 kV Pooling Sub Stations and associated transmission lines at Ananthapuramu Ultra Mega Solar Park (1500MW), Ananthapuramu-II Ultra Mega Solar Park (500MW) and Kadapa Ultra Mega Solar Park (1000MW), A.P for a period of 1 year." Approximate Value of Premium: Rs. 38.11 Lakhs. For details visit: www.apspcl.ap.gov.in (or) www.apeprocurement.gov.in
Managing Director & CEO

జిల్లా పంచాయితీ అధికారి కార్యాలయము, అనంతపురము.
ఆర్.సి.నెం. E486085/2024/B4 (పం) తేది : 04-03-2024
షార్ట్ టెండరు నోటీసు
అనంతపురము జిల్లాలోని బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, కంబదూర్, కుందుర్పి మరియు శెట్టూరు మండలములోని 74 గ్రామ పంచాయితీలందు 2960, 30 వాట్స్ యల్.ఇ.డి వీధి దీపములు ఫిట్టింగ్స్ (పైపు, క్లాంపు, ఇతర accessories) తో సహా సప్లయి చేయుటకు బజాజ్, సూర్య, సిస్కో, క్రాంప్టన్ ఇతర ఆసక్తి గల కంపెనీల డీలర్ల నుండి టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు 5-3-2024 నుండి జారీ చేయబడును, 9-3-2024 సాయంత్రం 2-30 వరకు స్వీకరించబడును. 9-3-2024 సాయంత్రం 3-00 గంటలకు అనంతపురము జిల్లా జాయింట్ కలెక్టరు వారి ఎదుట సీల్డ్ టెండర్లు తెరవబడును. టెండరు డిపాజిట్టు రూ. 50,000/- డి.డి. ద్వారా చెల్లించవలెను మరియు రూ. 500/- చెల్లించి టెండరు షెడ్యూలు పొందవచ్చును. ఇతర వివరములకు జిల్లా పంచాయితీ అధికారి వారి కార్యాలయము, అనంతపురము (కమ్మ భవనము వెనుక) సంప్రదించవచ్చును. ఫోన్ నెం. 7780774947. ఏ కారణముతో అయిన టెండర్లు ఎప్పుడైనను రద్దు పరచుటకు DPC కి అధికారము కలదు.
సం/- కె.యల్. ప్రభాకరరావు, జిల్లా పంచాయితీ అధికారి, అనంతపురము.

రాయదుర్గం పురపాలక సంఘం
ఆర్.ఓ.సి.నెం. 31/2020/A1 తేది : 04-03-2024
బహిరంగ వేలము ప్రకటన
రాయదుర్గం పురపాలక సంఘమునకు చెందిన దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్ మరియు జంతు వధశాలను (కబేల) తేది : 01-04-2024 నుండి 31-03-2025 తేది వరకు 12 నెలల కాలమునకు గుత్తలు (గేట్) వసూలు చేసుకొనుటకు లీజుకు ఇచ్చుటకు తేది 07-03-2024 ఉదయం 11-00 గంటలకు మునిసిపల్ కార్యాలయము ఆవరణము నందు బహిరంగ వేలము జరుపబడును మరియు అసెంబ్లీ / పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా బహిరంగ వేలం నందు పాల్గొనదలచిన వారు ఈ క్రింది విధముగా ధరావత్తు మరియు సాల్వెన్సి సొమ్మును ఆఫీసు నందు చెల్లించి బహిరంగ వేలములో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

వ.నెం	గుత్త వివరములు	వేలం సమయమున ముందుగా చెల్లించవలసిన ధరావత్తు	వేలమునకు ముందుగా హాజరు పరచవలసిన మొత్తం (సాల్వెన్సీ సర్టిఫికేట్) సర్టిఫికేట్ విలువ
1	దినసరి కాయగూరల మార్కెట్లో గల మార్జిన్లలో మరియు రోడ్డు మార్జిన్ లందు రుసుము వసూలు చేసుకొనుటకు హక్కు	రూ. 1,50,000/-	రూ. 3,00,000/-
2	వారపు సంత మార్కెట్ లలోను మరియు రోడ్డు మార్జిన్ లందు రుసుము వసూలు చేసుకొనుటకు హక్కు	రూ. 50,000/-	రూ. 1,50,000/-
3	మేకలు, గొర్రెలు జంతు వధశాల లలో రుసుము వసూలు చేసుకొనుటకు హక్కు	రూ. 20,000/-	రూ. 1,00,000/-

మిగిలిన వివరములు కార్యాలయము పనివేళలలో తెలుసుకొనవలెను.
సం/- కమిషనరు, రాయదుర్గం పురపాలక సంఘము

ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తే ఎలా?

- బయోమైనింగ్‌పై మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వ్యాఖ్యలు అర్థరహితం
- మేయర్ వసీం


మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి బయోమైనింగ్‌పై అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా? తనకంటే అపారమైన రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి ఇలాంటి మాటలు మాట్లాడడం సరికాదు. ఓ సారి ఆయన ఆత్మ విమర్శ చేసుకోవాలని మేయర్ వసీం హితవు పలికారు. బయోమైనింగ్‌లో రూ.కోట్లలో అవకతవకలు జరిగాయని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సోమవారం మేయర్ వసీం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఏమీ తెలియని వారు మాట్లాడి ఉంటే తాను స్పందించే వ్యక్తిని కాదన్నారు. వేసవి కావడంతో వేడికి మంటలు వ్యాపిస్తే దాన్ని కూడా రాజకీయం చేయాలనుకోవడం భావ్యం కాదన్నారు. మంటలు వ్యాపించిన వెంటనే ఫైర్ ఇంజన్లతో పాటు నగరపాలక సంస్థ ట్యాంకర్ల ద్వారా మంటలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో మునిసిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పని చేసిన ప్రభాకర్ చౌదరి ఏదో కొంత వరకు అయినా అవగాహనతో మాట్లాడుతారని ప్రజలు కూడా అనుకుంటున్నారన్నారు. బయో మైనింగ్ ద్వారా చేపట్టిన చెత్త నిర్వహణలో రూ.26 కోట్ల అవినీతి జరిగిందని మాజీ ఎమ్మెల్యే మాట్లాడడం సరికాదన్నారు. కంపోస్టు యార్డులో గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్తతో స్థానికులు, చుట్టు పక్కల వారు ఇబ్బందులు పడకూడదని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో చెత్త నిర్వహణ చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 2021 జనవరి నాటికి 3,32,485 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వ ఉండేదని తెలిపారు. మెట్రిక్ టన్ను రూ.800 అంచనాతో టెండర్లు ఆహ్వానించగా.. రూ.689.54 ఫర్ మెట్రిక్ టన్‌కు లెస్‌కు నోవస్ గ్రీన్ ఎనర్జీ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ (సికింద్రాబాద్) టెండర్ దక్కించుకుందన్నారు. 2022 నుంచి 2023 జనవరి 31 వరకూ చెత్త నిర్వహణ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.9.79 కోట్ల బిల్లులు మాత్రమే సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించడం జరిగిందన్నారు. ఇంకా రూ.2.23 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చూస్తే.. రూ.26 కోట్ల కుంభకోణం జరిగిందంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

అవినీతికి కేరాఫ్ టీడీపీ

అవినీతికి కేరాఫ్ టీడీపీ అని మేయర్ వసీం ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో నగరపాలక సంస్థ నిధులను అడ్డగోలుగా దోచుకున్న విషయాన్ని ప్రజలు మర్చిపోవడం లేదన్నారు. ఒక రోడ్డు వేసి డబుల్ బిల్లులు కోకొల్లలుగా చేసుకున్నారన్నారు. మట్టిదిబ్బల తొలగింపు పేరుతో మట్టిని తినేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. నగరం రూపురేఖలను మార్చేశామన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి చౌకబారు రాజకీయాలు చేయకూడదని హితవు పలికారు. సమావేశంలో కార్పొరేటర్ సైపుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ సైట్లను శుభ్రంగా ఉంచుకోండి


38వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఓపెన్ సైట్లను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత సంబంధిత యజమానులదే అని మేయర్ వసీం స్పష్టం చేశారు. సోమవారం 38వ డివిజన్‌లో పర్యటించారు. ఓపెన్ సైట్లలో చెత్తా చెదారం వేయడం, వాటిని పట్టించుకోకపోవడంతో ముళ్ల పొదలు పెరిగి అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయన్నారు. అపరిశుభ్రతతో నగరవాసులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా దోమకాటు వ్యాధులు అధికమయ్యే సమస్య లేకపోలేదన్నారు. యజమానులు వారి స్థలాలకు రక్షణ గోడలు ఏర్పాటు చేసుకుని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం స్థానికులతో మేయర్ మాట్లాడారు. కాలువలను శుభ్రం చేయించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. తరచూ కాలువలు శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ సమక్షంలోనే అప్పటికప్పుడు కాలువలను నగరపాలక సంస్థ సిబ్బంది శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఖాజా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ


వృద్ధురాలు దేవరకొండ మల్లీశ్వరికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ బీ నాగపద్మ

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న 9వ డివిజన్‌కు చెందిన దేవరకొండ మల్లీశ్వరికి వలంటీర్ నాగపద్మ సోమవారం రాత్రి వృద్ధాప్య పింఛన్ అందించారు. ఈనెల 3న వలంటీర్ నాగపద్మ వృద్ధురాలు మల్లీశ్వరికి పింఛన్ ఇవ్వడానికి వెళ్లింది. వేలుముద్ర పడకపోవడంతో సోమవారం మరోసారి ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ వేలిముద్ర తీసుకుని పింఛన్ అందించింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ దేవి చొరవ, వలంటీర్ నాగపద్మ అందించిన సేవలను దేవరకొండ మల్లీశ్వరి కుటుంబీకులు అభినందించారు.

నేడు 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 2వ డివిజన్‌లోని కల్పనాజోషి కాలనీలో మంగళవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఓటు వజ్రాయుధం


ఎలక్ట్రానిక్ ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఓటు వజ్రాయుధం. ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని పి.యాలేరు గ్రామ సచివాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ మిషన్‌లో ఓటు ఎలా వేయాలి? ఏ బటన్ నొక్కితే ఏ గుర్తుకు ఓటు పడుతుంది తదితర విషయాలను ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలిమ, సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి, పంచాయితీ సెక్రటరీ ఖాదర్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫణిరెడ్డి, అతిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


లక్ష్మీదేవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ తల్లి జూటూరు లక్ష్మీదేవి (55) మృతి చెందింది. ఆదివారం రాత్రి మూర్ఛ రావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమెకు సోమవారం ఉదయం గుండెనొప్పి రావడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, రూరల్ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య తదితరులు కక్కలపల్లిలో చంద్రకుమార్ నివాసానికి చేరుకున్నారు. లక్ష్మీదేవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రకుమార్‌ను ఓదార్చారు.

పథకాలను ఇంటింటికీ వివరించాలి


మాట్లాడుతున్న జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకు అందరూ కృషి చేయాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని రాణినగర్, యువజన కాలనీలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకందించిన సేవలను గుర్తు చేయాలన్నారు. సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే పాలననందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోగుల లక్ష్మీదేవి, సుమతి, మునిశేఖర్, జేసీఎస్ నియోజక కన్వీనర్ ఎద్దుల అమర్‌నాథ్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు మధు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

ఆత్మకూరు: పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్ అని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సోమవారం ఆత్మకూరులో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవరత్నాల్లోని పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరిందన్నారు. గతంలో కన్నా ఆత్మకూరు మండలం నుంచి ఎక్కువ మెజార్టీ ఇచ్చి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చొరవతో గతంలో ఎన్నడూ జరగని విధంగా రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు తెలిపారు. ప్రకాష్‌రెడ్డి తమ సొంత నిధులతో ఉచితంగా బోర్లు వేయించారన్నారు. అంతేకాకుండా జిల్లాలో ఎక్కడా జరగని విధంగా జగనన్న ఇళ్ల నిర్మాణం ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే జరిగిందని పేర్కొన్నారు. ఎంతో మంది విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం చేసి వారి భవిష్యత్‌కు అండగా నిలిచారని కొనియాడారు. మహిళాభివృద్ధి కోసం అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి మహిళా పాడి రైతులకు అండగా నిలిచారన్నారు. నీటి సమస్య పరిష్కారానికి ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు రూ.117 కోట్లతో పీఏబీఆర్ ద్వారా పైప్‌లైన్లు వేయించి ట్యాంకులు కూడా నిర్మాణం చేయిస్తున్నారని తెలిపారు.

పార్టీలోకి వచ్చిన వారిని భయపెడుతున్నారు

వైఎస్సార్‌సీపీ పాలనలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై చాలా మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని టీడీపీ నాయకులు ఇళ్ల దగ్గరకు వెళ్లి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గత రెండు రోజుల క్రితం ఆత్మకూరులో చాకలి ఎర్రిస్వామి స్వచ్ఛందంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అయితే అదే రోజున టీడీపీ నాయకులు ఎర్రిస్వామి ఇంటి దగ్గరికి వెళ్లి నాలుగు గోడల మధ్యలో బలవంతంగా టీడీపీ కండువా వేశారని తెలిపారు. స్వచ్ఛందంగా పార్టీలోకి వస్తున్న వారిని ఇంటి దగ్గరికి వెళ్లి బెదిరించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ వాళ్లు భయభ్రాంతులకు గురి చేశారంటూ ఎల్లో మీడియాలో, సోషల్ మీడియాలో టీడీపీ వాళ్లు రాయించారని తెలిపారు. ఎవరూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నది పరిటాల సునీత తెలుసుకోవాలన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బంధూక మధు, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, విశ్వనాథ్, సద్దికూటి నాగిరెడ్డి, చిన్న అంజినప్ప, పవన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం


వలంటీర్ కళ్యాణి భర్త ఈడిగ రాఘవేంద్రకు ఆర్థికసాయం చేస్తున్న గద్దె కేశవ రెడ్డి

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామానికి చెందిన వలంటీర్ ఈడిగ కళ్యాణి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ బోర్డు సభ్యుడు గద్దె కేశవ రెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. వివరాలు.. వలంటీర్ కళ్యాణి గత నెల 22న అనంతపురం నుంచి ఆటోలో వస్తుండగా హంపాపురం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 5 మందికి గాయాలు కాగా ఈడిగ కళ్యాణి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వెంటనే స్పందించారు. వలంటీర్ కళ్యాణి విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి కళ్యాణి శస్త్ర చికిత్సల కోసం రూ.5 లక్షలను మంజూరు చేయించారు. కళ్యాణి శస్త్ర చికిత్సలకు స్పందించక బ్రెయిన్ డెడ్ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఆమెను అనంతపురం సర్వజనా ఆస్పత్రికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న గద్దె కేశవ రెడ్డి సోమవారం కళ్యాణి భర్త ఈడిగ రాఘవేంద్రకు రూ.20 వేలు అందజేశారు.

టైం స్కేలు ఉద్యోగులుగా పరిగణించాలి


ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న మినిమం స్కేలు ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న 212 మంది మినిమం స్కేలు ఉద్యోగులను టైం స్కేలు ఉద్యోగులుగా పరిగణించాలని పలువురు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేశారు. గత కొన్ని రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించలేదని వాపోయారు. దీంతో నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు మినిమం స్కేలు ఉద్యోగులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం ఇవ్వాలని కోరారు. ఇతర వర్సిటీల్లో అమలు చేస్తున్న తరహాలో ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేయాలని విన్నవించారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి ఆదేశాలతో రిజిస్ట్రార్ మినిమం స్కేలు ఉద్యోగులతో మాట్లాడారు. టైం స్కేలు వర్తింపచేయాలని ప్రభుత్వానికి విన్నవించిన నేపథ్యంలో నిర్ణయం వచ్చే వరకూ వేచి ఉండాలని ఉద్యోగులతో నచ్చజెప్పారు. దీంతో ఉద్యోగులు ఆందోళన విరమించారు. వర్సిటీ ఉన్నతాధికారులు తమ సమస్యలు పరిష్కరిస్తారనే నమ్మకంతో ఉన్నామని ఉద్యోగులు స్పష్టం చేశారు. మండుటెండలోనే ఆందోళన చేసిన ఉద్యోగులు ఎట్టకేలకు నిరసన విరమించారు. కార్యక్రమంలో మినిమం స్కేల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మల్లిరెడ్డి, జనరల్ సెక్రెటరీ మంజునాథ్, అక్కులప్ప, హాస్టల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మారెప్ప, సెక్రెటరీ గోపి, తదితరులు పాల్గొన్నారు.

రెండు చుక్కలతో నిండు నూరేళ్లు


పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: రెండు చుక్కలతో చిన్నారులు నిండు నూరేళ్ల ఆరోగ్యంగా జీవిస్తారని వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని 16 పంచాయతీల్లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది రెండో రోజు ఇంటింటా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని వైద్యాధికారులు పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి 82 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అదేవిధంగా మొబైల్ టీం, బస్టాండ్‌లో 91 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ, వైద్య, అంగన్ వాడీ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవతకు పూజలు

ఆత్మకూరు: మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో పొలిమేర పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయాన్నే పర్వాత, కలశ పూజలు, అభిషేక శాంతులు, గణపతి హోమం, వాస్తు హోమాల అనంతరం మహా మంగళహారతి అందించారు. సాయంత్రం ప్రాణదోషకాల పూజలు, దీక్షాహోమం, వాస్తు హోమం, తదితర పూజలు చేపట్టారు. మంగళవారం పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని గ్రామస్తులు తెలిపారు.

డయాలసిస్ బాధితుడికి పింఛన్ మంజూరు

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లికి చెందిన బడగొర్ల మారుతి అనే డయాలసిస్ పేషంట్‌కు ప్రభుత్వం నూతనంగా రూ.10 వేల పింఛన్ మంజూరు చేసింది. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మారుతికి పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎజ్జె ఆంజనేయులు, రామ్మోహన్, నర్సిరెడ్డి, కొలప్ప తదితరులు పాల్గొన్నారు.


పార్వతీ పరమేశ్వరులను హంస వాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం, మహిళల కోలాటం

హంస వాహనంపై
పార్వతీ పరమేశ్వరుల వైభవం


అలంకరణలో పార్వతీ పరమేశ్వరులు

అనంతపురం కల్చరల్: పరమేశ్వరుని బ్రహ్మోత్సవ వేడుకలు భక్తిభావాన్ని నింపుతున్నాయి. మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయం వద్ద మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి కాశీవిశ్వేశ్వరుడు పార్వతీ సమేతుడై హంస వాహనంపై ఊరేగి దర్శనమిచ్చాడు. ఉదయం సరస్వతీ హోమం, సాయంత్రం దీక్షా హోమం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, దశహారతులు తదితర కార్యక్రమాలు జరిగాయి. మాఘమాసంలో వచ్చిన సోమవారం కావడంతో భక్తజనం పెద్ద ఎత్తున తరలివచ్చి మహాశివుడిని దర్శించుకున్నారు. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక నృత్యకళానికేతన్ నాట్యాచార్యులు విజయకుమార్ శిష్యబృందం భక్తిగీతాలు, శాస్త్రీయ నాట్యాలతో మహాశివుడికి నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్, తిమ్మారెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకట స్వామి, పరమేష్, అర్చకులు నరసింహశాస్త్రి, హర్షశర్మ, కిషోర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


నాట్యం చేస్తున్న కళాకారిణులు

'పథకాలను చంద్రబాబు అపహాస్యం చేశారు'

రాప్తాడురూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో సోమవారం పెనుకొండలో జరిగిన 'రా.. కదలి రా' సభ హుందాతనం లేకుండా పోయిందని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చిల్లర మాటలకే పరిమితమైన సీనియర్ రాజకీయ నాయకుడు, గగ్గోలు పెట్టిన సభా ప్రాంగణం అని పేర్కొన్నారు. నాయకుడి ముందే ధర్మవరం టీడీపీ నాయకుల ముష్టియుద్ధాలు, పెనుగొండ టీడీపీ నాయకుల ధిక్కార స్వరాలు కనిపించాయన్నారు. పవన్ పరిస్థితి మారీచుని పరిస్థితేనని జనసేనానీలు వాపోతున్నారన్నారు. సభ ఆద్యంతం ఆత్మస్తుతి పరనిందే అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఏమి చేశాడో భవిష్యత్తులో ఏమి చేయబోతున్నాడో స్పష్టంగా చెప్పలేని దుస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలను అపహాస్యం చేసిన తీరు చంద్రబాబు మానసిక స్థితికి ప్రతిరూపం అన్నారు. రాయలసీమ ద్రోహి జగన్ అనడం చూస్తే దొంగే, దొంగ దొంగ అని అరిచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. సీనియర్ పొలిటీషియన్ సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని హితవు పలికారు.

జీజీహెచ్‌లో చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు, అమ్మ రమణారెడ్డి

అనంతపురం మెడికల్: అమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ప్రారంభించారు. వేసవి కాలంలో రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జడ్జి కిష్టప్ప, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, అమ్మ సేవా ట్రస్టు నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం: నగరంలోని పాతూరు పవర్ స్టేషన్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన బాలయ్య (70) అనే వృద్ధుడు హత్య కేసులో నిందితుడు మహమ్మద్ రఫీ (65)ని అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీఐ వి.రెడ్డప్ప తెలిపారు. సీఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓ వృద్ధాశ్రమంలో ఉన్న బాలయ్య శనివారం రాత్రి నగరంలోకి వచ్చాడు. బాలయ్యతో పాటు మహమ్మద్ రఫీ ఇద్దరూ పూటుగా మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇద్దరూ ఒకరినొకరు వాదులాడుకున్నారు. మహమ్మద్ రఫీ చేతిలో ఉండే మద్యం గ్లాస్ కిందకు పడేసిన బాలయ్య తూలుతూ కింద పడిపోయాడు. మహమ్మద్ రఫీ కూడా తూలుతూ కిందకు పడిపోయి లేచి బండరాయి బాలయ్య ముఖం మీద వేశాడు. దీంతో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందారు. నిందితుడు మహమ్మద్ రఫీని అరెస్ట్ చేసి కస్టడీకి తరలించినట్లు పేర్కొన్నారు.

వీఏహెచ్‌ఏలకు నియామక పత్రాలు


నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్ఏ)గా నియమితులైన వారికి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.గౌతమి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. వీఏహెచ్ఏ పోస్టుల భర్తీలో భాగంగా ఇటీవల ఉమ్మడి జిల్లా పరిధిలో 439 మంది అర్హత సాధించారు. వీరందరికీ ఆదివారం పోస్టింగ్, ప్లేస్‌మెంట్ ఇచ్చే కార్యక్రమం మొదలు పెట్టారు. సోమవారం రాత్రి వరకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. మిగిలిన వారికి మంగళవారం ఇవ్వనున్నట్లు పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.

డిస్కౌంట్‌తో 'లేపాక్షి' ఉత్పత్తులు


లేపాక్షి ఎంపోరియంలో ఉత్పత్తులపై డిస్కౌంట్ ప్రకటిస్తున్న అధికారులు

అనంతపురం కల్చరల్: హస్తకళాకారులను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని లేపాక్షి ఎంపోరియంలో డిస్కౌంటు ధరలతో కళా ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఎంపోరియంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హస్తకళాకారులను ఆదరించడం ద్వారా మన సంస్కృతీ సంప్రదాయాలకు గౌరవం దక్కుతుందన్నారు. ఆ నేపథ్యంలోనే ప్రత్యేకంగా ఎంపిక చేసిన హస్తకళా ఉత్పత్తులపై 10 శాతం నుంచి 40 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాటమయ్య, అమర్, నాగార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్ చెరువులో పేకాట స్థావరంపై సోమవారం రూరల్ పోలీసులు మెరుపు దాడి చేశారు. చెరువులో ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సీఐ రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది వెళ్లి దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727